క్లుప్తంగా

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పరవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెల 19, 20, 21 తేదీల్లో మచిలీపట్నంలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన జి.గౌతమ్, జి.హర్షిత, ఎ.హర్షిత బంగారు పతకాలు సాధించారు. ఈ ముగ్గురూ సోమవారం ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి తెలిపారు. విజేతలను, కోచ్‌లు అమర్‌నాథ్, అన్నపూర్ణలను పాఠశాల సీఈవో కె.నిశాంత్ అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

వైద్య, రక్తదాన శిబిరాలకు విశేష స్పందన


రక్తదాతకు ప్రశంసాపత్రం అందిస్తున్న నిర్వాహకులు

పెందుర్తి: సుజాతనగర్‌లోని సురభి క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలకు చక్కటి స్పందన లభించింది. డాక్టర్ జి.వి.ఎస్.రాము, డాక్టర్ జి.లక్ష్మి మాధవి ఆధ్వర్యంలో దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. అనంతరం జరిగిన రక్తదాన శిబిరంలో విజయశ్రీ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. చినముషిడివాడలోని ట్రిపుల్ ఎస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు మురిపిండి సన్యాసిరావు, తార్కాశరావు, జి.సన్యాసిరావు, పి.ఈశ్వరరావు, కె.అఖిల్, సాయిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

1,250 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

పెందుర్తి: స్థానిక ప్రశాంతినగర్‌లో అనధికారికంగా నిల్వ చేసిన 1,250 కిలోల పీడీఎస్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని ఫిర్యాదు చేసినట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. ప్రశాంతినగర్‌లో నాగల్ల నాగేశ్వరరావు అనే వ్యక్తి పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచాడు. దీనిపై నిఘా ఉంచిన పౌర సరఫరాల అధికారులు ఆదివారం దాడులు చేసి 1,250 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

బండి తగలబెట్టేశారు..


కాలిపోయిన ద్విచక్ర వాహనం

భీమునిపట్నం: తమ అమ్మాయిని ప్రేమిస్తున్నాడన్న కారణంతో అమ్మాయి బంధువులు ప్రేమిస్తున్న యువకుడి ద్విచక్రవాహనాన్ని ఆదివారం సాయంత్రం తగలబెట్టేశారు. వివరాలివి.. విశాఖ ప్రాంతానికి చెందిన యువతి, యువకుడు ప్రేమించుకుంటున్నారు. వీరిని అమ్మాయి తరఫువారు మందలించినా వినలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం భీమిలివైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నట్టు సమాచారం అందడంతో, ఇక్కడ బీచ్‌రోడ్డులోని మార్లిన్‌కే రెస్టారెంట్ వద్ద అమ్మాయి బంధువులు వీరిని అడ్డుకున్నారు. దీంతో భయపడి యువకుడు పారిపోగా వారు కోపంతో అతని ద్విచక్రవాహన్ని తగలబెట్టి, అమ్మాయిని తీసుకుని వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని సీఐ సుధాకర్ తెలిపారు.

శీతాకాలం అతిథులు

చలికాలంలో వెచ్చని నేస్తాలు.. ఉన్ని దుస్తులు


కొనుగోలు చేస్తున్న ప్రజలు

- ఆకర్షణీయంగా.. మన్నికగా ఉండే స్వెట్టర్లు, జర్కిన్లు, కంబళ్లు
- దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయిస్తున్న భోపాల్ వ్యాపారులు
- ఆసక్తి చూపుతున్న కొనుగోలుదారులు


ఆకర్షణీయంగా కంబళ్లు, జర్కిన్లు, స్వెట్టర్లు


అడవివరం బీఆర్‌టీఎస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఉన్ని దుస్తుల దుకాణాలు

సింహాచలం: శీతాకాలం వచ్చిందంటే చాలు.. చలి తీవ్రత, మంచు ప్రభావం ఎక్కువగా ఉంటాయి. పిల్లలు, పెద్దలు అని తేడా లేకుండా అనారోగ్యానికి గురయ్యే పరిస్థితులు కూడా అధికం. మంచు ప్రభావంతో ఒక్కోసారి ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితులు ఏర్పడుతుంటాయి. చలి తీవ్రతను తట్టుకుని, శరీర ఉష్ణోగ్రతలను పెంచుకోవడం ఎంతో ముఖ్యం. చలి తీవ్రత నుంచి మన శరీరాన్ని కాపాడే వాటిల్లో కంబళ్లు, జర్కిన్లు, స్వెట్టర్లు తమ వంతు పాత్ర పోషిస్తుంటాయి. ఈ తరుణంలోనే 98వ వార్డులో కొన్ని రోజులుగా రంగురంగుల కంబళ్లు, జర్కిన్లు, స్వెట్టర్లు కనువిందు చేస్తున్నాయి.

అడవివరం – సింహాచలం రహదారిలో...

అడవివరంలోని గోశాల జంక్షన్ నుంచి సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ఉన్న బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిలో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు వ్యాపారులు గడిచిన దీపావళి తర్వాత వచ్చి పది తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేశారు. అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి 60 ఏళ్లు పైబడిన వృద్ధుల వరకు జర్కిన్లు, స్వెట్టర్లతోపాటు పలు సైజుల్లో కంబళ్లు విక్రయిస్తున్నారు. అటు పెందుర్తి నుంచి, ఇటు గోపాలపట్నం నుంచి సింహాచలం మీదుగా విశాఖ నగరంలోకి బీఆర్‌టీఎస్ రోడ్డులో రాకపోకలు సాగించే వారిని ఇవి ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. మన్నికతోపాటు దృఢంగా ఉండటంతో వీటిని కొనుగోలు చేస్తున్నారు.

వ్యాపారం అంతంత మాత్రమే



వర్షం పడితే మా వ్యాపారం సాగదు. కస్టమర్లు కూడా రారు. ఈ నెలలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో మా వ్యాపారం సరిగ్గా సాగలేదు. పైగా షాపులు తెరవడం కష్టమైంది. మెటీరియల్ అంతటినీ కొనుగోలుదారులు ఆకర్షించేలా డిస్‌ప్లేగా పెట్టాలి. వర్షాలతో అది సాధ్యం కాలేదు. రానున్న రోజులైనా వ్యాపారం బాగా జరగాలని కోరుకుంటున్నాను.

– బహదూర్ బంజార, వ్యాపారి, భోపాల్

జనవరిలో వెళ్లిపోతాం



మేము గడిచిన దీపావళి రోజు వ్యాపారం నిమిత్తం విశాఖకు వచ్చాం. వ్యాపారం సజావుగా సాగాలని కోరుకుంటున్నాం. మేము దాదాపు 50 రోజుల పాటు ఉంటాం. వంట, నిద్ర కూడా ఏర్పాటు చేసుకున్న దుకాణాల వద్దే. జనవరిలో స్వగ్రామాలకు వెళ్లిపోతాం

– మోను బంజార, వ్యాపారి, భోపాల్

దుకాణాల వద్దే వంట, నిద్ర


దుకాణం వద్దే వంట చేసుకుంటున్న వ్యాపారులు

దేశ రాజధాని ఢిల్లీ నుంచి సరకు ట్రాన్స్‌పోర్ట్‌లో భూపాల్‌కు చెందిన వ్యాపారులు విశాఖకు తీసుకొస్తున్నారు. అక్కడి నుంచి వ్యాన్‌ల్లో సింహాచలం తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. కొందరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయగా.. మరికొందరు భూపాల్‌కు చెందిన వర్కర్లనే తమతోపాటు తీసుకొచ్చి రోజు కూలీలుగా దుకాణాల్లో ఉంచి వ్యాపారం సాగిస్తున్నారు. ఇలా ఒక్కో వ్యాపారికి రెండు మూడేసి దుకాణాలున్నాయి. వాటి వద్దే ప్రతి రోజూ వ్యాపారులు మధ్యాహ్నం, రాత్రి వంట చేసుకుని భోజనం చేస్తున్నారు. రాత్రి వేళల్లో దుకాణాల వద్దే నిద్రిస్తున్నారు. ఈ నెలాఖరుకు గాని, జనవరి మొదటి వారంలో గాని వీరంతా వ్యాపారం ముగించుకుని తిరిగి వారి స్వగ్రామాలకు వెళ్లనున్నారు. మిగితా రోజుల్లో దేవుడి సింహాసనాలు, దేవుడి పీటల విక్రయాలతోపాటు పలు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఉంటారు. దేశమంతా తిరుగుతుంటారు. కొన్ని నెలలపాటు తమ గ్రామాల్లో వ్యవసాయం చేస్తుంటారు. గోధుమలు పండిస్తుంటారు. ఇలా ప్రతి ఏటా వ్యాపారులంతా ఇక్కడికొచ్చి ఉన్ని దుస్తుల విక్రయాల ద్వారా జీవనోపాధి పొందుతున్నారు.

రోడ్డు విస్తరణపై ఆందోళన


రోడ్డు విస్తరణపై ఆందోళన చేస్తున్న వేపగుంట ప్రాంత వాసులు

పెందుర్తి: వేపగుంట–పినగాడి రహదారిని 150 అడుగులకు విస్తరిస్తే రోడ్డు పక్కన దశాబ్దాలుగా నివసిస్తున్న తాము రోడ్డున పడతామని వేపగుంట ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తీర్ణం తగ్గిస్తే తమకు మేలు జరుగుతుందని, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. రోడ్డు విస్తరణ చేయనున్న విస్తీర్ణంపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేస్తూ వేపగుంట ప్రాంతవాసులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణను తాము స్వాగతిస్తున్నామని, అదే సమయంలో గరిష్ఠంగా 150 అడుగులు అంటే తమ నివాసాలపై ప్రభావం పడుతుందని వాపోయారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని కోరారు. వేపగుంట పరిసర ప్రాంత వాసులు, చిరు వ్యాపారులు ఆందోళనలో పాల్గొన్నారు.

బెల్ట్ దుకాణంపై దాడి

50 మద్యం బాటిళ్ల స్వాధీనం.. నిర్వాహకుడి అరెస్ట్

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని సౌభాగ్యరాయపురం(ఎస్‌ఆర్ పురం)లో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ దుకాణంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఏపీ ఎక్సైజ్ యాక్ట్ ద్వారా కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. బెల్ట్ దుకాణాలపై దాడులు కొనసాగుతాయని, నిర్వాహకులు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డుపై తుప్పలు.. రాకపోకలకు అవస్థలు


వెంకటపతిపాలెం రోడ్డులో దట్టంగా పెరిగిన తుప్పలు

పరవాడ: నాయుడుపాలెం శివారు గంగునాయుడుపాలెం–వెంకటపతిపాలెం రహదారిలో దట్టంగా పెరిగిన తుప్పల కారణంగా ఇరు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంగునాయుడుపాలెంవాసులు ఏ చిన్న వస్తువు కావాలన్నా వాడ చీపురుపల్లి వెళ్లాలి. అయితే, ముందుగా వెంకటపతిపాలెం వెళ్లి అక్కడి నుంచి ఆటోలపై ఇతర గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుంది. గంగునాయుడుపాలెం నుంచి వెంకటపతిపాలెం వైపు వెళ్లే మార్గానికి ఇరువైపులా తుప్పలు, డొంకలు దట్టంగా పెరిగాయి. దీంతో చీకటి పడితే ఆ మార్గంలో బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సి వస్తోంది. రాత్రి సమయంలో విష పురుగులు, జంతువులు రోడ్డుపై మకాం వేయడం వలన ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు కలగజేసుకుని రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలను తొలగించాలని ఉత్తరాంధ్ర జిల్లాల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కూండ్రపు కృష్ణంనాయుడు తదితరులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


దేవీపురంలో కలుసుకున్న రాంపురం జెడ్పీ హైస్కూల్ 1988-89 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని దేవీపురంలో ఆదివారం రాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 1988–89 టెన్త్ బ్యాచ్ విద్యార్థులంతా నాటి స్కూల్ లీడర్ శ్రీను ఆధ్వర్యంలో దేవీపురంలో కలిశారు. అనాటి తీపి జ్ఞాపకాలను, అల్లరి పనులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా సహపంక్తి భోజనాలు చేసి గ్రూప్ ఫొటోలు దిగారు. ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లక్ష్మణ, సత్యనారాయణ, కనకరాజు, సమత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపనలో పాల్గొన్న సీఐ రమణ తదితరులు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం శివారు జోడుగుళ్లలో వెలిసిన శ్రీబంగారమ్మ తల్లి, కుంచాలమ్మ, మంచాలమ్మ అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక సీఐ పిన్నింటి రమణ చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, మాజీ సర్పంచ్‌లు మండల సముద్ర, దనిమిరెడ్డి శ్రీనివాసరావు, నాయకులు, గ్రామ పెద్దలు బలిరెడ్డి అప్పారావు, అడ్వకేట్ బేతిన శ్రీనివాసరావు, కోరాడ శ్రీనివాసరావు, రోమాల చంద్రశేఖర్, పల్ల తాతారావు, కోటాన అప్పారావు, బైలపూడి దేముడుబాబు, చిత్రాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

సబ్బవరం: మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 9వ తేదీ నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకూ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతులంతా తమ సమస్యలను సదస్సు దృష్టికి తీసుకురావచ్చని తెలియజేశారు.

షెడ్యూల్ ఇలా.. : ఈ నెల 9న అయ్యన్నపాలెంలో, 10వ తేదీన వంగలిలో, 11న ఉదయం ఎల్లుప్పి, మధ్యాహ్నం బోదువలస గ్రామాల్లో , 12న రాయపుర అగ్రహారంలో, 13న ఉదయం బంగారమ్మపాలెం, మధ్యాహ్నం అద్దూరు శిరసపల్లిలో సదస్సులు ఉంటాయని తెలిపారు. అలాగే ఈ నెల 16న నంగినారపాడులో, 17న టిక్కలిపాలెంలో, 18న అంతకాపల్లిలో, 19న అజనగిరిలోను, 20న గంగవరంలో, 21న ఉదయం నల్లరేగులపాలెంలో, మధ్యాహ్నం నారపాడులో, 23న బాటజంగాలపాలెంలో, 24న వెదుళ్లనరవలో సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 26న అమృతపురంలో, 27న ఉదయం గొల్లలపాలెంలో, మధ్యాహ్నం విప్పాక అగ్రహారంలో, 28న చింతగట్ల అగ్రహారంలో, 30న ఉదయం గుల్లేపల్లి, మధ్యాహ్నం మొగలిపురంలో, 31న లగిశెట్టిపాలెంలో రెవెన్యూ సదస్సులు ఉంటాయని తెలియజేశారు. వచ్చేనెల 2న ఆరిపాకలో, 3న ఉదయం అసకపల్లి, మధ్యాహ్నం ఎరుకునాయుడుపాలెంలో, 4న ఉదయం గొటివాడ, మధ్యాహ్నం గాలిభీమవరంలో, 6న ఉదయం పైడివాడ, మధ్యాహ్నం ఇరువాడలో, 7న ఉదయం సబ్బవరం, మధ్యాహ్నం సబ్బవరం అగ్రహారంలో, 08 పైడివాడ అగ్రహారంలో ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రైతులందరూ ఈ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన


స్వర్ణ పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగ దళాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు అందించారు.

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట


అమ్మవారికి పూజలు చేస్తున్న కర్రి అప్పారావు తదితరులు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహపురి కాలనీలోని శ్రీ పోలమాంబ ఆటోస్టాండ్ ప్రాంగణంలో ఉన్న దుర్గాదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. శక్తి ఆగమశాస్త్రం ప్రకారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. సింహపురికాలనీ, అప్పన్నపాలెం తదితర ప్రాంతాల నుంచి నివాసితు లు, భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించా రు. దుర్గాదేవిని దర్శించుకున్నారు. ఆటోస్టాండ్ యూనియన్ అధ్యక్షుడు కర్రి అప్పారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హైందవ శంఖారావ ర్యాలీ నేడు

తగరపువలస: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక మెయిన్‌రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి హైందవ శంఖారావ ర్యాలీ, సమ్మేళనం నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ ప్రతినిధులు తెలిపారు. పట్టణ ప్రజలంతా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వివరాలకు 98663 55904, 99087 29298 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దేవస్థానం ఫొటోగ్రాఫర్‌కు ఈవో అభినందనలు


అవార్డు పొందిన ఫొటోగ్రాఫ్, ఫొటోగ్రాఫర్ శ్రీనివాస్‌తో ఈవో త్రినాథరావు

సింహాచలం: ఫొటోగ్రఫీలో ఉత్తమ పురస్కారం అందుకున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఫొటోగ్రాఫర్ తెంటు శ్రీనివాస్‌ను సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అభినందించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గత నెల 30న 132వ ప్రపంచ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా మరియు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్వవిద్యాలయం పాత్రికేయ విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా తెంటు శ్రీనివాస్ తీసిన అప్పన్న ఆలయంలోని భూవరాహస్వామి ఫొటో శ్రీ రాజ దీన్‌దయాళ్ మెమోరియల్ అవార్డు గెలుచుకుంది. అక్కడ తెంటు శ్రీనివాస్ అవార్డు తీసుకున్నారు. అవార్డు గ్రహీత శ్రీనివాస్‌ను ఈవో త్రినాథరావు ఆదివారం ఆలయంలో దుశ్శాలువాతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ త్రిమూర్తులు పాల్గొన్నారు.

వైభవంగా వడ్డ పోలమ్మ పండగ


అన్న సమారాధన ప్రారంభిస్తున్న శరగడం చినఅప్పనాయుడు

పెందుర్తి: పెందుర్తి ద్రోణంరాజునగర్‌లో కొలువుదీరిన వడ్డ పోలమ్మతల్లి వార్షిక పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు–కుంకుమలు, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను మాజీ కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ నేత శరగడం చినఅప్పలనాయుడు ప్రారంభించారు. 3 వేల మంది ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. పలువురు ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గోసేవతో జీవనం సార్థకం



హరేకృష్ణ వైకుంఠంలో నిర్మించిన శ్రీవారి గోశాల


గోవుకు మేత అందిస్తున్న నిష్కించిన భక్తదాస

తగరపువలస: భారతదేశంలో జన్మించిన వారు గోవులకు, బ్రాహ్మణులకు, విష్ణుభక్తులకు భక్తితో సేవ చేసుకోవడం ద్వారా జీవితాన్ని సార్థకం చేసుకోవాలని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి యదురాజా దాస అన్నారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవి రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ నిష్కించిన భక్తదాస ఆధ్వర్యంలో శ్రీవారి గోశాల ప్రారంభించారు. ఈ సందర్భంగా యదురాజా దాస తన బోధనలలో గోవుల ప్రాధాన్యత గురించి వివరించారు. మానవ శరీరాన్ని పరిపూర్ణంగా అభివృద్ధి చేయడానికి గోవు అత్యంత ముఖ్యమైనదన్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ వ్యవస్థాపకులు భక్తి వేదాంత స్వామి ప్రభుపాదులు తన బోధనలలో ఆవు ప్రాముఖ్యత గురించి వివరించేవారన్నారు. డాక్టర్ నిష్కించిన భక్తదాస మాట్లాడుతూ మానవ సమాజానికి వాటి పవిత్ర స్వభావానికి వేద సంస్కృతిలో గోవులు ముఖ్యమైనవిగా పరిగణించబడ్డాయన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ హరేకృష్ణ ఉద్యమ సంకీర్తన మేళా నిర్వహించారు.

శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల ప్రదర్శనలో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6గంటలకు ప్రదర్శించిన శాస్త్రీయ జానపద నృత్యాలు ఆహూతులను అలరించాయి. సింహాచలంకు చెందిన సరస్వతి నృత్య కళామందిర్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు తాము అభ్యసించిన నృత్యరీతులను అద్భుతంగా ప్రదర్శించి, అలరించారు. మూషిక వాహన నృత్యాంశంతో ప్రారంభమైన కార్యక్రమంలో బ్రహ్మ కడిగిన పాదము, అదివో అల్లదివో .. ముద్దుగారే యశోదా.. తదితర అన్నమయ్య కీర్తనలకు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. జానపద గేయాలకు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బాలసరస్వతి నృత్య దర్శకత్వంలో భువన, హిరణ్య, ఊర్మి భవిష్య, వైష్ణవి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని స్థానిక పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.